ఐటీ కార్యాలయం ప్రారంభం

ఐటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, మార్చి 25: అమీన్‌పూర్ మున్సిపల్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో జల్టిక్స్ టెక్ లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ ఆఫీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని మొట్టమొదటి ఐటీ కంపెనీని ప్రారంభించినందుకు గర్వంగా ఉన్నదన్నారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు తల్లారి రాములు, కార్యకర్తలు, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారానికి జూనియర్ సివిల్ కోర్టు మంజూరు

జిన్నారం, మార్చి 25: జిన్నారం మండలానికి జూనియర్ సివిల్ ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరు అయినట్లు ఎంపీపీ రవీందర్ గౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కోర్టు ఏర్పాటుకు అనువైన భవనాలను వారం రోజుల్లో సంబంధిత కోర్టు అధికారులు పరిశీలిస్తారని పేర్కొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

న్యాల్‌కల్, మార్చి 25: మండలంలోని హద్నూర్‌లో మంగళవారం నుంచి జరిగే వీరభద్రేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామివారి విగ్రహంతో పాటు బసవన్న, శివలింగం విగ్రహాలను భాజాభజంత్రీల హోరు, భజన కీర్తనల మధ్య ఊరేగింపుతో ఆలయానికి తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం వేదమంత్రోచ్చరణాల మధ్య స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి అభిషేకం, హారతి, హోమం తదితర ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు 5కే రన్

అందోల్, మార్చి 25: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలో ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా 5కే రన్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. ఆర్డీవో కార్యాలయం నుంచి అన్నాసాగర్ వరకు రన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక యువతీయువకులు పాల్గొనాలని కోరారు.

అంత్యక్రియలకు తక్షణసాయం

బొల్లారం, మార్చి 25: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో నివసించే బీహార్ రాష్ట్రానికి చెందిన సరితాతివారి(55) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ కాంగ్రెస్ యువ నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల తక్షణసాయాన్ని అందించారు. అలాగే కాలనీవాసులు రూ.12వేల నగదును చందా వేసి బాధిత కుటుంబానికి అందజేసి బాసటగా నిలిచారు. కార్యక్రమంలో నాయకులు చక్రపాణి, జంగి రెడ్డి, శ్రీను, నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, నిరంజన్, రమేశ్, జగన్, సురేశ్, అనూప్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు తక్షణసాయం అందిస్తున్న ప్రవీణ్ రెడ్డి

జిన్నారం: హోలీ సంబురాల్లో యువకుల కేరింతలు

సంగారెడ్డి: హోలీ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

జహీరాబాద్ పట్టణంలో హోలీ నిర్వహిస్తున్న బంజారా ఉద్యోగులు

కంది: చిన్నారుల సందడి

సంబురంగా హోలీ

జిల్లా వ్యాప్తంగా సోమవారం హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఊరూ వాడా, చిన్నా, పెద్ద తేడా లేకుండా ఆనందోత్సాహాల మధ్య కేరింతలు కొడుతూ రంగుల్లో మునిగితేలారు. సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రూపేశ్ ఉట్టి కొట్టి వేడుకలను ప్రారంభించారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకొని సంబురపడ్డారు. ఆదివారం రాత్రి కాముని దహనం చేశారు. కొంతమంది గ్రామాల్లో హోలీ పాటలు పాడుతూ సందడి చేశారు. చిన్నారులు ఉత్సాహంగా పరుగులు తీస్తూ ఒకరికొకరూ రంగులు చల్లుకున్నారు. మధ్యాహ్నం వరకు కలర్‌ఫుల్‌గా ఎంజాయ్ చేశారు. పలు చోట్ల హోలీ వేడుకల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 25

అదనపు ఎస్పీ సంజీవరావ్‌పై రంగులు చల్లుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

గుమ్మడిదల: బొంతపల్లిలో బీఆర్ఎస్ నాయకులు

అందోల్: జోగిపేటలో హోలీ వేడుకలు

నాగల్‌గిద్ద: గంగారాం తండాలో..

రాయికోడ్: హోలీ వేడుకల్లో యువకులు

హత్నూర: చింతల్‌చెరులో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు

నారాయణఖేడ్: రాజీవ్‌చౌక్ వద్ద హోలీ వేడుకలు

ఆర్సీపురంలో హోలీ వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పానగేశ్

సంగారెడ్డి పట్టణంలో సందడి చేస్తున్న చిన్నారులు, పెద్దలు

మునిపల్లి: బుసారెడ్డిపల్లిలో..



న్యాల్‌కల్: డప్పూర్‌లో బీఆర్ఎస్ నేతల హోలీ సంబురాలు

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

సంగారెడ్డి, మార్చి 25: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని మెదక్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహిస్తునట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల్లో భాగంగా సంగారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తునట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్లమెంట బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్ రామ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. పట్టణంలోని పోతిరెడ్డిపల్లి పీఎస్ఆర్ గార్డెన్‌లో ఉదయం 11గంటలకు సమావేశం ఏర్పాటుకు అన్ని సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని పార్టీ ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళా కమిటీలు, రైతు, యువజన విభాగం కమిటీలు తప్పక హాజరు కావాలని కోరారు.

జాతీయ పురస్కారానికి ఏర్పుల శ్రీనివాస్ ఎంపిక

జిన్నారం, మార్చి 25: జాతీయ ఉగాది నంది పురస్కార్‌కు తాను ఎంపికైనట్లు మండల కేంద్రం జిన్నారం గ్రామానికి చెందిన ఏఐఎస్ఎస్‌డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దళితరత్న అవార్డు గ్రహీత ఏర్పుల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ అవార్డును ఈనెల 31 వేములవాడలో సంస్థ నిర్వాహకులు అందజేస్తారని పేర్కొన్నారు.

సామాజిక కార్యకర్త శారదకు అవార్డు

బొల్లారం, మార్చి 25: బొల్లారం మున్సిపాలిటీ పరిధికి చెందిన సామాజిక కార్యకర్త, జెండర్ కమిటీ సభ్యురాలు గొల్లగూడ శారద సామాజిక సేవలను గుర్తించి నగరానికి చెందిన సార్వత్రిక పరిషత్, మయూరి ఆర్ట్స్ అకాడమీ అత్యున్నత సామాజిక అవార్డుకు ఎంపిక చేశారు. తనను అవార్డుకు ఎంపిక చేయడం పట్ల సామాజిక కార్యకర్త శారద సోమవారం సంతోషం వ్యక్తం చేశారు.

వీరభద్రస్వామి ఆలయంలో చండీ హోమం

గుమ్మడిదల, మార్చి 25: జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీసమేత వీరభద్రస్వామి ఆలయంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని చండీహోమం నిర్వహించారు. సోమవారం వీరభద్రస్వామి దేవాలయంలో ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య ఆధ్వర్యంలో భక్తులు చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్చరణలతో చండీహోమాన్ని నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

నియామక పత్రాలతో సభ్యులు

బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

నారాయణఖేడ్, మార్చి 25: నారాయణఖేడ్ మండల బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని రాధాకృష్ణ మందిర్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించి ఎన్నికల అధికారి బక్షి కిషన్‌రావు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బక్షి రవీందర్, ఉపాధ్యక్షులుగా సురేశ్‌రావు, అనంత్‌రావు దేశ్‌పాండే, జారి సుజాత, ప్రధాన కార్యదర్శిగా నర్సింహారావు పటేల్, సంయుక్త కార్యదర్శులుగా మనోజ్, సంతోశ్ దేశ్‌పాండే, కోశాధికారిగా చంద్రకాంత్, కార్యవర్గ సభ్యులుగా సంజీవ్‌కుమార్, అనంత పద్మనాభం, చిన్ని ప్రథమేశ్, బక్షి నవనీత్, నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు.

మహిళా సంఘం..

బ్రాహ్మణ సంఘం మహిళా కమిటీని ఎన్నుకోగా అధ్యక్షురాలిగా ఉజ్వల, ఉపాధ్యక్షులుగా జ్యోతి, శారదాబాయి, ప్రధాన కార్యదర్శిగా దొరి నీరజ, సంయుక్త కార్యదర్శులుగా సురేఖ, సవిత, కోశాధికారిగా నీరజ, కార్యవర్గ సభ్యులుగా మంగలాబాయి, విజయలక్ష్మి, కల్పన, కరుణ, ప్రియాంక ఎన్నికయ్యారు.

ఈతకు వెళ్లిన బాలుడు నీటమునిగి మృతి

గుమ్మడిదల, మార్చి 25: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి నీట మునిగి మృతిచెందిన బాలుడి విషాద ఘటన పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లవల్లి నల్లచెరువులో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లవల్లి గ్రామానికి చెందిన వడ్డ బ్రహ్మచారి చిన్న కొడుకు వడ్డ కార్తీక్(14)తన మిత్రులైన బండారి హర్షవర్ధన్, బొడ్డు బన్ని, తలారి చరణ్, బండారి మణితో కలిసి ఆదివారం గ్రామంలోని నల్లచెరువు వద్దకు ఈతకు వెళ్లాడు. ఈత రాక వడ్డ కార్తీక్ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. సాయంత్రం కావడంతో ఇంకా ఇంటికి రాని కొడుకు కోసం కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈతకు వెళ్లినట్లు అనుమానం రావడంతో గ్రామస్తులు బొమ్మబోయిన వెంకటేశ్, వడ్డ శ్రీశైలం కలిసి నల్లచెరువు వద్దకు వెళ్లి చెరువులో వెతకడంతో వడ్డ కార్తీక్ మృతదేహం లభ్యమైంది. ఒడ్డుకు తీసి నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. తనకొడుకు మృతిపై అనుమానం ఉన్నదని తండ్రి బ్రహ్మచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

గుమ్మడిదల, మార్చి 25: రోడ్డు దాటుతున్న వృద్ధుడిని కారు ఢీకొట్టడంతో దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. ఈ ఘటన పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంతపల్లి జాతీయ రహదారిపై చోటు చేసుకుంది.

ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం బొంతపల్లి జాతీయ రహదారి పక్కన ఉన్న కేతకీ భ్రమరాంబమల్లికార్జున జాతరకు గుమ్మడిదల గ్రామానికి చెందిన పాదాల మల్లేశ్(60), భార్య శ్యామమ్మ, తమ్ముడి బిడ్డతో కలిసి వచ్చారు. సాయంత్రం జాతర ముగియడంతో స్వగ్రామానికి వెళ్లడానికి మల్లన్న గుడి నుంచి జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా వస్తున్న డస్టర్ కారు మల్లేశ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు, చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కొడుకు పాదాల సాయిలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సూరారంలోని మల్లారెడ్డి దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. కారు డ్రైవర్ సంతోష్ అని తెలిసింది. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ప్రతిష్ఠ మహోత్సవం



కర్చల్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలకు హాజరైన నాయకులు

రాయికోడ్, మార్చి 25: మండల పరిధిలోని కర్చల్ గ్రామంలో నుతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మదేవి ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమయ్యాయని జైగౌడ సంఘం మండల అధ్యక్షుడు బాబాగౌడ్ తెలిపారు. సోమవారం గణపతిపూజ, అంకురార్పణం, మండప ప్రవేశం, స్వస్తిపుణ్యాహవచనం, నవగ్రహ, దేవత పూజ, తదితర పూజలు చేశారు. కార్యాక్రమంలో పాల్గొన్న నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్వరాజుపాటిల్, మాజీ సర్పంచ్‌లు బాబుకుమార్, శ్రీనావాస్ రెడ్డి, సంగమేశ్వర్‌పాటిల్, చంద్రశేఖర్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బస్వరాజు, జైపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌గౌడ్, సంగమేశ్వర్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, విష్ణుగౌడ్, గాజుల ఫణిరాజు పాల్గొన్నారు.

మంజీరాలో అరట్టు దిగ్విజయం

సంగారెడ్డి, మార్చి 25: అయ్యప్ప స్వామి ఆలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. సోమవారం అయ్యప్ప స్వామి అరట్టు కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి అయ్యప్ప భక్తులు జలాభిషేకం నిర్వహించి పుణ్య కార్యక్రమం జరిపించారు.

అయ్యప్ప స్వామి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న అయ్యప్ప భక్తులు

అంతర్గాంలో బీరప్ప జాతర

బీరప్ప కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సిర్గాపూర్, మార్చి 25: మండలంలోని అంతర్గాంలో బీరప్ప ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. బీరప్ప, కామరతిల వివాహ మహోత్సవం కనుల పండువగా జరిగింది. స్థానిక గొల్ల, కురుమలు తమ ఆచార సంప్రదాయ పద్ధతిలో బీరప్ప జాతర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై బీరప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని నిర్వాహకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, కురుమ సంఘం తాలుకా అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మల్గొండ, సిర్గాపూర్ కురమ సంఘం మండల అధ్యక్షుడు సంతు, నిర్వాహకులు బీరుగొండ, నర్సుగొండ, అంజిగొండ, సాయిగొండ, తదితరులు పాల్గొన్నారు.

జార్జ్ సేవలు మరువలేనివి

న్యాల్‌కల్, మార్చి 25: మండలంలోని అమీరాబాద్ మాజీ సర్పంచ్ జార్జ్ కుటుంబ సభ్యులను సోమవారం జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్ పరామర్శించారు. ఇటీవల మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకుడు జార్జ్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను పార్టీ మండల నాయకులతో కలసి పరామర్శించారు. గ్రామ అభివృద్ధితోపాటు పార్టీ కోసం జార్జ్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన వెంట డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు దత్తరెడ్డి, రసీద్‌సాబ్ తదితరులు ఉన్నారు.

పరామర్శిస్తున్న జహీరాబాద్ మాజీ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, మార్చి 25: మండలం పరిధిలోని గర్జెగాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దోండేరావును నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. దోండేరావు ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోగా, మాజీ ఎమ్మెల్యే ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొని ధైర్యాన్నిచ్చారు. అంతార్గం బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్ రెడ్డి తల్లి చనిపోగా, వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనవెంట జడ్పీటీసీ రాఘవరెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు అంజయ్య, ప్రభాకర్, పవర్‌సింగ్, మల్గొండ, సంతు మాజీ సర్పంచ్ మారుతి ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలి

న్యాల్‌కల్, మార్చి 25: ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని, అప్పుడే సేవా దృక్పథం పెరుగుతుందని ఝరాసంగం మండలం బర్ధీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవదూతగిరి మహరాజ్, డా.సిద్దయ్య స్వామి అన్నారు. సోమవారం మండలంలోని హద్నూర్ దత్తగిరి ఆశ్రమం నుంచి బయలుదేరిన దత్తగిరి మహారాజ్ పాదయాత్ర-పల్లకీసేవకు గంగ్వార్, మిర్జాపూర్, న్యామతాబాద్, ఖలీల్‌పూర్ గ్రామాలకు చెందిన భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం భక్తులు దత్తగిరి మహరాజ్ పల్లకీసేవకు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దత్తగిరి మహరాజ్ పాదయాత్ర-పల్లకీ సేవలో భక్తులు